క్లుప్తంగా

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

మునగపాక: స్థానిక సంతబయిల వినాయక ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. పురాతన వినాయక ఆలయం కావడంతో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకునేందుకు తరలివచ్చారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ మందపాటి రాము తగు చర్యలు తీసుకున్నారు.

24న సాంబశివుని ఆలయ వార్షికోత్సవం



మునగపాకలోని సాంబశివుని ఆలయం

మునగపాక: సాంబశివుని ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 24న మునగపాకలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపారు. 23న స్వామి వారి కల్యాణరాట మహోత్సవం, 24న ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 10గంటల నుంచి సాంబశివుని కళ్యాణ ఘట్టం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు రాత్రికి ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య సంకీర్తనలు, కోలాటం ప్రదర్శన వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మంగళవరపుపేటకు చెందిన మొల్లేటి ఆదినారాయణ జ్ఞాపకార్థంగా భార్య లక్ష్మీ సోమేశ్వరమ్మ, కుమారుడు వేంకట సూర్య పెంటారావు తమవంతు విరాళంగా రూ.51,116 కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రూ.5 కోట్లతో వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాండ్రేగుల జగ్గారావు, మళ్ల సంజీవరావు, వెలగా శ్రీనివాసరావు, పెంటకోట ఉమేష్, మొల్లేటి సత్యనారాయణ, సూరిశెట్టి శ్రీనివాస్, సుధా రాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మూలపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. గ్రామంలో మెయిన్ రోడ్డు నుంచి శ్మశానం వాటిక షెడ్ వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆయన గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, తోటాడ, పంచాయతీ కార్యదర్శులు శ్రీలక్ష్మి, గంగాధర్, జనసేన మండలాధ్యక్షుడు టెక్కలి పరశురామ్, ఆడారి కాశీరావు, ఆడారి నాయుడు, నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ తాగునీటి కనెక్షన్లపై చర్యలు



అక్రమ కనెక్షన్లను పరిశీలిస్తున్న కార్యదర్శి ప్రసాద్

మాకవరపాలెం: మల్లవరంలో తాగునీటి పైపులైన్ల ద్వారా అక్రమంగా కనెక్షన్లు ఇళ్లలోకి అమర్చుకోవడంతో పూర్తిస్థాయిలో ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ కనెక్షన్లపై అందిన ఫిర్యాదుతో గురువారం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఇంటింటికీ వెళ్లి అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కనెక్షన్లను పరిశీలించారు. కొందరు వ్యవసాయ భూములకు పైపుల ద్వారా తాగునీటిని మళ్లించిన విషయాన్ని కూడా గుర్తించారు. అక్రమ కనెక్షన్లు వెంటనే తొలగించి, ప్రజలకు సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.



నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లో రక్షణలేని పార్కింగ్



అడ్డురోడ్డులో బ్రిడ్జి కింద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

పార్కింగ్ చేస్తే.. బండి గోవిందా..





నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం -2లో చెట్టు కింద ద్విచక్ర వాహనాలు పార్కింగ్



రైల్వే స్టేషన్‌లో నిఘా లేని ప్లాట్ ఫాం -2

ఎస్.రాయవరం: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అడ్డురోడ్డు, నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ స్థలంలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. దాంతో వాహనచోదకులు లబోదిబోమంటున్నారు. ప్రధానంగా మండలంలో అడ్డురోడ్డు కూడలిలో ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాలకు చెందిన పలువురు ప్రయాణికులు, పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు వందల సంఖ్యలో రాకపోకలు నిత్యం చేస్తుంటారు. అడ్డురోడ్డు జంక్షన్ కావడం, జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ కింద ఖాళీ ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసుకుని విధులకు వెళ్తున్నారు. అదే క్రమంలో నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ పరిధిలోనూ విద్యార్థులు, కార్మికులు, ప్రయాణికులు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఎస్.రాయవరం పరిసర గ్రామాల నుంచి అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లో కంపెనీకి వెళ్లి వచ్చే కార్మికులు డ్యూటీల వారిగా ద్విచక్ర వాహనాలను వినయ్ కళాశాల సమీపంలో కొబ్బరితోటకు ఆనుకుని పార్కింగ్ చేస్తున్నారు. ఇలా మండలంలో మూడు చోట్ల వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారు. దీనిని అలుసుగా తీసుకుని గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు, వివిధ విడిభాగాలు ఎత్తుకుపోతున్నారు. మరి కొందరులు బైకులు చోరీ చేస్తున్నారు. ఇప్పటికే పలు వాహనాలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇదే ప్రదేశంలో కొన్నేళ్లగా కార్మికులు, ప్రయాణికులు ద్విచక్ర వాహనాలు ఉంచుతున్నా.. పోలీసులు రక్షణ ఏర్పాట్లు చేపట్టలేదు. అడ్డురోడ్డు బస్టాప్ వద్ద, రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్‌కు కాపలా ఏర్పాటు చేయాలని, కనీసం సీసీ కెమారాల నిఘా ఉంచితే, కాస్త రక్షణగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అడ్డురోడ్డు, నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్లులోనూ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ ఏర్పాటు చేసి కాపాలాదారులను నియమించాలి. హోం మంత్రి నివాసం సమీప ప్రాంతాల్లో మరింత నిఘా ఉంచాలి. తాత్కాలిక అవసరం కోసం బ్రిడ్జి కింద పార్కింగ్ చేస్తే, పెట్రోలు, కొన్ని సందర్భాల్లో బైకులు చోరీకి గురవుతున్నాయి. పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

– పోలిశెట్టి పెద ఈశ్వరరావు,దార్లపూడి, ప్రయాణికుడు

పార్కింగ్ చేయవద్దని హెచ్చరిస్తున్నాం



అనుమతులు లేనిచోట వాహనాలు పార్కింగ్ చేయవద్దని హెచ్చరిస్తున్నాం. అడ్డురోడ్డు బ్రిడ్జి కింద వాహనాలు ఎక్కువగా పెడుతున్నారు. అక్కడ చోరీలు జరిగినా రక్షణ లేదు. నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లోనూ రక్షణ లేదు. సీసీ కెమెరా నిఘా లేదు. స్టేషన్ సిబ్బందికి నోటీష్ ఇచ్చాం. ఎస్.రాయవరం వినయ్ కాలేజీ వద్ద కూడా బైకులు పార్కింగ్ చేయవద్దని చెప్పాం. దుకాణాల వద్ద పార్కింగ్ చేసుకునేవారికి వ్యాపారులకు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నోటీసులు ఇచ్చాం. పబ్లిక్ ప్రాంతాల్లో మరికొన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. మరిన్ని ఏర్పాటు చేసేందుకు నివేదిక ఇచ్చాం.

– విభీషణరావు, ఎస్ఐ, ఎస్.రాయవరం

పచ్చగడ్డి నోట్లో పెట్టుకుని వినూత్న నిరసన



పచ్చగడ్డి నోట్లో పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ఎస్.రాయవరం: 'తిండైనా పెట్టండి.. చేసిన పనికి డబ్బులైనా ఇవ్వండి' అని పచ్చగడ్డి నోటిలో పెట్టుకుని ఉపాధి కూలీలు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వమ్మవరం, పి.ధర్మవరం గ్రామాల్లో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ గ్రామాల్లో తొమ్మిది వారాలుగా ఉపాధి పనులు చేస్తుంటే, కనీసం పైసా కూలి చెల్లించలేదని వాపోయారు. కూలి పనులు చేసుకుని బతికే తాము తిండి ఎలా తినాలని ప్రశ్నించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కూలీల సమస్యలు పట్టవా అని నినదించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని విమర్శించారు. బడ్జెట్ నిధులు కేటాయింపు మొక్కుబడిగా ఉందన్నారు. వేసవి ప్రారంభమైనా పని ప్రదేశంలో టెంట్లు, దూరప్రాంతాలకు రవాణా, మంచినీటి సౌకర్యం కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో రత్నం, సూరిబాబు, సత్యవతి పాల్గొన్నారు.

24 నుంచి ఉచిత ఎంసెట్ కోచింగ్

నర్సీపట్నం: ఎస్ఏఎన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, చారిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నామని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఉమామహేశ్వరి, ఆర్గనైజర్ కృష్ణ తెలిపారు. ఈ నెల 24 నుంచి నర్సీపట్నం మున్సిపాలిటీ రామారావుపేటలో తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91823 96247, 94932 95638 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

పీ-4 సర్వే వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి



సమావేశానికి హాజరైన వీవోఏలు

మునగపాక: పీ–4 సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వీవోఏలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీ–ఓ సర్వేలో వీవోఏలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్పొరేషన్ రుణాలకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. కుట్టు మిషన్ల శిక్షణ విషయమై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 23న ఉల్లాస్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఏపీఎం బాలరాజు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

21, 22 తేదీలలో పీ –4 గ్రామసభలు

కోటవురట్ల: పీ– 4 సర్వేకు సంబంధించి మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో రెండు రోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 21న ఆక్సాహేబుపేట, అన్నవరం, బోడపాలెం, చినబొడ్డేపల్లి, చౌడువాడ, గొట్టివాడ, జల్లూరు, కైలాసపట్నం, కొడవటిపూడి, కోటవురట్ల, నీలిగుంట, పాములవాక, పందూరు, రాజుపేట, రామచంద్రపాలెం, రామచంద్రపురం, సుంకపూరు, టి.జగ్గంపేట, తంగేడు, కె.వెంకటాపురం, యండపల్లి గ్రామాల్లోనూ, 22న బి.కె.పల్లి, లింగాపురం, పి.కె.పల్లి, రామన్నపాలెం గ్రామాల్లోనూ గ్రామసభ నిర్వహిస్తారని తెలిపారు. సర్వేలో గుర్తించిన అంశాలను గ్రామసభల్లో వివరిస్తారని, అభ్యంతరాలు ఉంటే తెలియపరచవచ్చని తెలిపారు.

అందుబాటులో పశుగ్రాస విత్తనాలు



పాడి రైతుకు పశుగ్రాస విత్తనాలు అందిస్తున్న ఏడీ నరేష్

కోటవురట్ల: పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు పెట్ల నరేష్ తెలిపారు. గురువారం ఆయన పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. వేసవి దృష్టిలో పెట్టుకుని పశుగ్రాస కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఎస్ఎస్‌జీ, ఆఫ్రికాన్ టాల్ మొక్కజొన్న రకాలు గడ్డి విత్తనాలు 3 టన్నులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. వీటిని 75 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. ఐదు కిలోల బ్యాగ్ మొక్కజొన్న రకం రూ.340 కాగా, రాయితీ పోను రూ.68, ఎస్ఎస్‌జీ రకం రూ.460 కాగా, రాయితీ పోను రూ.92కు అందిస్తున్నామని తెలిపారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ



శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు

మునగపాక: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ కోరారు. మండలంలోని తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ భీ-పడాయి భీ కార్యక్రమంపై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలు, బాలింతలు, గర్భిణులకు మెరుగైన ఆహారం అందించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

అచ్యుతాపురం రూరల్: పోషణ్ భీ-పఢాయి భీ అనే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.పైడికొండ ఆధ్వర్యంలో శిక్షణ కల్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా తరగతులు గురువారం పూడిమడక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు దాటిన చిన్నారులకు అక్షరాలను గుర్తించడం, చదివిపించడంపై శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు శేషు, సీడీపీవో ఇందిరా దేవి, అపరంజినీ, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్



భూములను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్: ల్యాండ్ పూలింగ్ భూమిపై వెంటనే దర్యాప్తు పూర్తి చేసి లబ్ధిదారులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని కుంచంగి, కూండ్రం రొంగలివానిపాలెం గ్రామాల్లో లోకనాథం తదితర బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐడీ దర్యాప్తు పేరుతో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. వాస్తవానికి అధికారులు లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని వాపోయారు. సంవత్సరానికి 60 వేల రూపాయల నుంచి రెండు లక్షల వరకు జీడి తోటల ద్వారా ఆదాయం వచ్చేదని, వాటిని తొలగించడం ద్వారా తీవ్రంగా రైతులు నష్టపోయారన్నారు. ఇప్పటికైనా దర్యాప్తును వెంటనే పూర్తి చేసి నిందితులపై చర్యలు తీసుకొని నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో త్రిమూర్తులు, పి. మురళీ, పి. శాంతికుమారి, బి. జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవాలి



చౌడువాడలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ముత్యాలనాయుడు

కె.కోటపాడు : గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు ఈ నెల 21న ఫ్యాక్టరీ వద్ద సభ్య రైతులతో కలిసి నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు కోరారు. చౌడువాడ, మల్లంపాలెం, పైడంపేట, గొండుపాలెం గ్రామాల్లో గురువారం పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీని నష్టాల పేరు చెప్పి కారుచౌకగా కొట్టేసేందుకు కూటమి నాయకులు గెద్దల్లాగ చూస్తున్నారని ఆరోపించారు. మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో ఫ్యాక్టరీ ఆధునికీకరణ, చెరకు బకాయిలపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫ్యాక్టరీని కాపాడతామని చెప్పి ఓట్లేయించుకున్న ఎంపీ సీఎం రమేష్ ప్రస్తుతం రైతులకు ఎక్కడా కనిపించడం లేదని ఆయన మండిపడ్డారు.

ఘనంగా మరిడిమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు



జాతర సందర్భంగా ప్రారంభించిన క్రికెట్ టోర్నీ

అచ్యుతాపురం రూరల్: ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గ్రామ దేవత మరిడిమాంబ జాతర ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. సాయంత్రం భారీ బాణసంచా, పలు సాంస్కృతిక కార్యక్రమాలు మధ్య అచ్యుతాపురం పుర వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు, కూనిశెట్టి రమణ, బొందల శ్యామ్, కిల్లాడి రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెరువు గట్లనూ వదిలి పెట్టడంలేదు..



అక్రమ తవ్వకాలతో సన్నబడిన చెరువు గట్టు

కోటవురట్ల: అక్రమార్కులు మట్టి, గ్రావెల్, ఇసుక.. ఇలా దేనినీ వదిలి పెట్టడంలేదు. ఉచితం ఏదైనా కనిపిస్తే చాలు.. దొరికినంతా దోచేస్తున్నారు. కొండలను కొల్లగొట్టి గ్రావెల్, వరాహనదిని చీల్చి ఇసుకను దోచేస్తుండగా, మట్టి కోసం చెరువులను వదిలి పెట్టడంలేదు. పాములవాక శివారు సుర్లవానిపాలెం గ్రామానికి సంబంధించిన చెరువు గట్టు మట్టిపై ఓ టీడీపీ నేత కన్ను పడింది. అంతే ఏమాత్రం జంకకుండా గట్టును తవ్వేసి మట్టిని తరలించుకుపోయాడు. ఎన్నో సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 15 అడుగుల వెడల్పున గట్టును పటిష్టం చేయగా, సదరు వ్యక్తి చెరువు చుట్టూ ఉన్న గట్టును సన్నగా తవ్వేసి భారీగా మట్టిని తరలించుకుపోయాడు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. అధికారం అండతో ఇటువంటి పనులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు, ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు పూజలో పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

బొజ్జన్నకొండ వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలి

తుమ్మపాల: మండలంలో బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన లేజర్ స్కిన్ థియేటర్‌లో లేజర్ షో, హరిత రిసార్ట్‌లో ఫుడ్ కోర్ట్ (క్యాంటీన్)ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ సభ్యులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్వో వైఎస్ సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ జిల్లాకు మణిహారం లాంటి బొజ్జన్నకొండ అభివృద్ధికి ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసి చేపట్టిన నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయని వాపోయారు. బొజ్జన్నకొండ చరిత్ర, విశిష్టత, ప్రాముఖ్యతలను తెలిపే లేజర్ స్కిన్ థియేటర్‌ను పర్యాటకులకు అందించాలని కోరారు. అన్ని సౌకర్యాలు కల్పించడం ద్వారా నిత్యం పర్యాటకుల సందడి పెరుగుతుందన్నారు. జిల్లా కేంద్రం పరిసరాలలోని పురాతన బొజ్జన్నకొండ అభివృద్ధిపై ఎంపీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలన్నారు. ఇక్కడ హరిత రిసార్ట్, లేజర్ షో థియేటర్‌ను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నా, నేటికి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, జిల్లా బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు బండి అప్పారావు, పి.దయాల్‌రాజ్ పాల్గొన్నారు.